


# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

క్రైస్తవ మాసపత్రిక

MARCH - 2009

సంవత్సర చందా రూ. 50/-

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న

## సత్యవాణి టి.వి. ప్రోగ్రాములు

| | | |
|---|---|---|
| ప్రతి ఆదివారం | : | ఉదయం 6.30 గంటలకు<br>రక్షణఛానల్ |
| ప్రతి సోమవారం | : | ఉదయం 6.00 గంటలకు<br>శుభవార్త ఛానల్ |
| ప్రతి బుధవారం | : | ఉదయం 7.00 గంటలకు<br>విస్సా ఛానల్ |
| ప్రతి శనివారం | : | ఉదయం 6.30 గంటలకు<br>రక్షణ ఛానల్ |

### ఈ కార్యక్రమాలను తప్పక చూడండి

మీ బంధు మిత్రులను ఇరుగు పొరుగువారును కూడ
వాటిని చూచుటకు ప్రోత్సా హించండి
మీ సంఘ కార్యక్రమములలో వీటిని గూర్చి ప్రత్యేక ప్రకటనలు
చేయండి

**SATYAVANI**, P.O. Box.80,
Kakinada - 533 001 Ph: 0884-2363722

# సత్యవాక్యం

## THE WORD OF TRUTH



P.o. Box -80, Kakinada, A.P. 533 001

Ph : 0884 - 2363722

Editor :

**Joshua Gootam**



*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి 29 | మార్చి 2009 | సంచిక -8


# దేవుని చట్టమే చెల్లును

(God's Law is Final)

దేవుడు మానవుని నైతిక వర్తనునిగా చేసారు. దేవుడేర్పరచిన నైతిక విలువలకు అతడు బద్ధుడై యుండునట్లు ఆయన అతనికి చట్టములనిచ్చారు. అయితే మానవుడు దేవునినైతిక సూత్రములను బట్టిగాక, తన స్వనీతిని స్థాపింపబూను కొనినప్పుడు ఈ లోకంలో గందరగోళం యేర్పడతాది. దేవుని నైతిక సూత్రములకు మానవుడు లోబడి నడుచు కొనునప్పుడు అతనికి ఇప్పుడును, ఎల్లప్పుడును ఆనందము కలుగుతాది.

అందువలన దేవుని చట్టములకు మానవుడు కలుపుటగాని, దానినుండి తీసివేయుట గాని , వాటి స్థానే వేరొకటి యుంచుట గాని చేయకూడదు. అంటే దేవుని చట్టమే అధికార పూరితమైనది. అది ఒక్కటే చెల్లుతాది. ఆయన మన సృష్టికర్త గనుక ఆయన చట్టమే చెల్లుబడి అవుతాది. మోషే ఇశ్రాయేలీయుల కిట్లు బోధించాడు: “మీదేవుడైన యెహోవా యిచ్చిన ఆజ్ఞలను మీ కాజ్ఞాపించు చున్నాను. వాటిని గైకొనుట యందు నేను మీ కాజ్ఞాపించిన మాటతో దేనిని కలుప కూడదు; దానిలోనుండి దేనిని తీసివేయకూడదు” (ద్వితీ 4:2). “ఆయన మాటలతో ఏమియు చేర్చకుము. ఆయన

నిన్ను గద్దించు నేమో అప్పుడు నీవు అబద్ధికుడవగుదువు" అని జ్ఞానియైన సొలొమోను హెచ్చరించాడు (సామె 30:6). మరియు "ఈ గ్రంధమందున్న ప్రవచన వాక్యములను విను ప్రతివానికి నేను సాక్ష్యమిచ్చునది యేమనగా-ఎవడైనను వీటితో మరిఏదైనను కలిపిన యెడల, ఈ గ్రంధములో వ్రాయబడిన తెగుళ్ళు దేవుడు వానికి కలుగజేయును; ఎవడైనను ఈ ప్రవచన గ్రంధమందున్న వాక్యములలో ఏదైనను తీసివేసిన యెడల, దేవుడు ఈ గ్రంధములో వ్రాయబడిన జీవవృక్ష ములోను, పరిశుద్ధ పట్టణములోను వానికి పాలు లేకుండ జేయును" (ప్రకటన 22:18,19).

దేవుని ఆజ్ఞల స్థానమున మానవులు తమ ఆజ్ఞలను ప్రవేశింపజేసిన యెడల అట్టివాడు శాపగ్రస్థుడగునని దైవవేదము చెప్పుచున్నది. "మేము మీకు ప్రకటించిన సువార్తగాక మరియొక సువార్తను మేమైనను, పరలోకమునుండి వచ్చిన యొక దూతయైనను మీకు ప్రకటించినయెడల అతడు శాపగ్రస్తుడవును గాక..... మీరు అంగీకరించిన సువార్తగాక మరియొకటి యెవడైనను మీకు ప్రకటించిన యెడల వాడు శాపగ్రస్తుడవును గాక" యని అపొ.పౌలు గలతియలోని క్రైస్తవులకు చెప్పాడు (గలతీ 1:8-9).

అందువలన మానవ కల్పిత సిద్ధాంతములను అనుసరించువారు దేవుని వ్యర్ధముగా సేవించుచున్నారు. దేవుడు బయల్పరచిన సువార్తను గాక వేరొక దానిని వారు బోధించుచున్నారు. ఆచరించుచున్నారు. గనుక దేవుని చట్టానికి కలుపుట గాని తీసివేయుట గాని చేయకుండుటకు జాగ్రత్త వహించాలి.

యేసుప్రభువు ఇట్లుచెప్పారు:"మీరు మీ పారంపర్యాచారము నిమిత్తమై దేవుని వాక్యమును నిరర్ధకము చేయుచున్నారు. వేషధారులారా, ఈ ప్రజలు తమ పెదవులతో నన్ను ఘనపరచుదురు గాని వారి హృదయము నాకు దూరముగా ఉన్నది; మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచు వారు నన్ను వ్యర్ధముగా ఆరాధించుచున్నారు" (మత్తయి 15:7-9; మార్కు7:7-9).

ఆత్మీయ విషయాల్లో మనము మానవకల్పిత సిద్ధాంతముల నుండి పారంపర్యాచారముల నుండి తొలగిపోవాలి. అపొ.పౌలు ఇట్లు చెప్పుచున్నాడు: "ఆయనను అనుసరింపక మనుష్యుల పారంపర్యాచారమును, అనగా ఈ లోక సంబంధమైన మూలపాఠములను అనుసరించి మోసకరమైన నిరర్ధక తత్వజ్ఞానము చేత మిమ్మును చెరపట్టుకొని పోవువాడెవ డైనను ఉండునేమో అని జాగ్రత్తగా

ఉండుడి'' (కొలస్స 2:8). మరల, సువార్తికుడైన తిమోతికి అతడిట్లు వ్రాసాడు: "ఓతిమోతీ, నీకు అప్పగింపబడిన దానిని కాపాడి, అపవిత్రమైనవట్టి మాటలకును, జ్ఞానమని అబద్ధముగా చెప్పబడిన విపరీత వాదములకును దూరముగా ఉండుము" (1తిమోతి 6:20). అందువలన మనము ఆయన శాసనములను వెదకి, వాటిని మన జీవితంలో అలవరచుకొనాలి.

ఇంతవరకు మనము నేర్చుకొన్నాదేమంటే, మానవునికి ఎంచుకొనే శక్తినిచ్చి దేవుడతని సృజించారు. దేవుని సంతోషపరచు విధంగా అతడు ఎంచుకొనునట్లు అతనికి దేవుడు నైతిక సూత్రాలను యిచ్చారు. దేవుడు మానవునికిచ్చిన మొదటి శాసనాన్నే ఆదాము హవ్వలు ఉల్లంఘించారు. అట్లు చేయుట వలన వారు ఈ లోకములోనికి శరీరాత్మల మరణాన్ని ప్రవేశింప జేసారు. ఆదామునుండి నేటివరకు యున్న మానవులందరు పాపము చేసారు. ఏలయనగా మానవులందరు దేవుని చట్టాన్ని ఏదైనా ఒక రీతిగా ఉల్లంఘించుచునే యున్నారు.

...అయితే ఆదాము యొక్క పాపమును మానవులు వారసత్వము వలన పొందుటలేదు. ఏలయనగా, "పాపము చేయువాడే మరణము నొందును; తండ్రియొక్క దోష శిక్షను కుమారుడు మోయుట లేదని, కుమారుని దోషశిక్షను తండ్రి మోయడు; నీతిపరుని నీతి ఆ నీతి పరునికే చెందును; దుష్టుని దుష్టత్వము ఆ దుష్టునికే చెందును" (యెహెజ్కేలు 18:20). మానవులు ఆదాము పాపాన్ని గాక, అతని పాపము యొక్క పర్యవసానాన్ని అనుభవించుచున్నారు. ఆ పర్యవసానమే భౌతిక మరణము. అయితే ప్రతివాడు చేయుచున్నపాపమును బట్టి తానే తన ఆత్మీయ మరణానికి బాధ్యుడగును.

మానవులలో ఏదో ఒక భ్రష్టనైజము ఉన్నందువలన వారు పాపము చేయుటలేదు. భ్రష్టనైజముతో ఎవడును జన్మించుట లేదు. ఆదామును దేవుడు భ్రష్టనైజముతో చేసారని కొందరు తలుస్తారు. గాని అట్లు కాదు. ఏలయనగా ఆదామును దేవుడు తన స్వరూపమందు, తన పోలిక చొప్పున చేసారు. దేవునిలో భ్రష్టనైజము, లేక పాపతత్వము అంటూ యేమీలేదు. ఆదాము తన స్వకీయ దురాశలననుసరించి మరలు కొల్పబడుట వలన పాపము చేసాడు.

"ఈ లోకమునైనను, లోకములో ఉన్నవాటినైనను ప్రేమింపకుడి... లోకములో ఉన్నదంతయు అనగా శరీరాశయు, నేత్రాశయు, జీవపుడంబమును తండ్రివలన పుట్టినవి

కావు. అవి లోకసంబంధమైనవే" (1యోహాను 2:16;17). ఈ లోక సంబంధమైన ఆశల వలన శోధింపబడి వాటికి లోబడిపోవుట వలన మానవుడు పాపము చేయును. మానవులందరు శోధనకు లొంగిపోవుట వలన పాపములో బడుచున్నారు. పాపము, మానవుని దేవునినుండి వేరుచేయును గనుక మానవులందరు దేవుని నుండి వేరై పోయారు. అయితే మానవుడు తిరిగి దేవుని ఎట్లు చేరుకొంటాడు ? తిరిగి చేరుకొనే మార్గాన్ని దేవుడేర్పరచడా? అవును ఆయన తప్పక ఏర్పరచారు. ఆ మార్గము యేసుక్రీస్తే. అందుకే ఆయన, "నేనే మార్గమును సత్యమును జీవమును. నా ద్వారానే తప్ప యెవడును తండ్రి యొద్దకు రాడు" అని చెప్పారు (యోహాను 14:6).

యేసుప్రభువు నందు విశ్వాస ముంచుము, నీ పాపముల విషయమై మారుమనస్సు పొందుము, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుము. తండ్రియొద్దకు చేరుము!!

# సాక్షిగా తుప్పు

## (Rust as a witness)

"భూమి మీద మీకొరకు ధనమును కూర్చుకొనవద్దు. ఇక్కడ చిమ్మెటయు తుప్పును తినివేయును. దొంగలు కన్నము వేసి దొంగిలెదరు. పరలోక మందు మీ కొరకు ధనమును కూర్చుకొనుడి. అచ్చట చిమ్మెటయైనను తుప్పైనను దాని తినివేయదు, దొంగలు కన్నము వేసి దొంగిలరు. నీ ధనమెక్కడ ఉండునో అక్కడనే నీ హృదయ ముండును" అని యేసు ప్రభువు చెప్పారు (మత్తయి 6:19-21).

పరలోక న్యాయస్థానము మానవుల క్రియలన్నిటిని పరీక్షించి న్యాయాన్ని ఇట్లు ప్రకటించుచున్నారు. "ఇదిగో ధనవంతులారా, మీ మీదికి వచ్చెడి ఉపద్రవములను గూర్చి ప్రలాపించి యేడువుడి. మీ ధనము చెడి పోయెను. మీ వస్త్రములు చిమ్మెటలు కొట్టినవాయెను. మీ బంగారమును మీ వెండియు తుప్పు పట్టినవి. వాటి తుప్పు మీ మీద సాక్ష్యముగా ఉండి అగ్నివలె మీ శరీరములను తినివేయును. అంత్యదినముల యందు ధనము కూర్చుకొంటిరి. ఇదిగో మీ చేలు కోసిన పని వారికియ్యక మీరు మోసముగా బిగబట్టిన కూలి మొర్ర పెట్టుచున్నది. మీ కోత వారి కేకలు సైన్యములకు

అధిపతియగు ప్రభువు యొక్క చెవులలో చొచ్చియున్నవి. మీరు భూమి మీద సుఖముగా జీవించి భోగాసక్తులై వధ దినమునందు మీ హృదయములను పోషించుకొంటిరి. మీరు నీతి మంతుడైన వానికి శిక్ష విధించిచంపుదురు. అతడు మిమ్మునుఎదిరింపడు"(యాకోబు5:1-6).

**తీర్పునాటి దృశ్యము :**

మొదటి నేరము, మీ బంగారము, వెండి తుప్పు పట్టినవి. మీ వస్త్రములు చిమ్మట తినివేసెను. ప్రపంచ మంతా గుట్టలుగుట్టలుగా యున్న వెండి బంగారముల యొక్క భయంకర దృశ్యం యిది. తీర్పునాడు వాటిని గూర్చి ఆలోచించుటకు భయం వేస్తోంది. యేసు యొక్క సిలువ మరణాన్ని గూర్చి లోకం అంతా చాటుటకు సరివడే ధనం సహోదరుల యొద్దవున్నది. వారాధనాన్ని స్వార్థానికి గాక క్రీస్తు కొరకు వినియోగించాలి.

తీర్పునాడు ధనవంతులను ఒక్కొక్కరని దేవుడు పిలుస్తారు. అతని యొద్ద జవాబు అడుగుతారు. అతని కాళ్ల యొద్ద తుప్పు పట్టిన ధనాన్ని చూపిస్తారు. నీవు దాన్ని ఎందుకు వినియోగించలేదని ప్రశ్నిస్తారు. నీవు బీదలకు యేమి చేసావు? విధవరాండ్ర కొరకు, అనాధల కొరకు యేమి చేసావు ? అని ప్రశ్నిస్తారు. సువార్తను ఎన్నడు వినని వారి కొరకు యేమి చేసావు? అని ప్రశ్నిస్తారు. నేనేమీ చేయలేదు గాని నా కొరకు ధనాన్ని కూర్చుకొన్నానని అతడు జవాబిస్తాడు.

అంత్యదినమందు నా వాక్యమే నీకు తీర్పు తీర్చునని నీవు వినలేదా? యని యేసు అతన్ని అడుగుతారు (యోహాను 12:48). ప్రభువా నన్ను కరుణించు, నేను అపరాధిని యని అతడు బ్రతిమలాడతాడు.

అప్పుడు యేసు, వెండి బంగారములు సద్వినియోగం చేయబడినప్పుడవి తుప్పు పట్టవు. ఈ తుప్పు చిమ్మటపట్టిన వస్త్రములు, నీకు కావలసిన దానికంటె ఎక్కువ దాచుకొన్నావని సాక్ష్యమిచ్చుచున్నవి. నీవు దాచుకొన్న ధనాన్ని వినియోగిస్తే ఎన్ని ఆత్మలు రక్షింపబడవచ్చునో ఆలోచించుకొనుము. ఈ తుప్పే నిన్ను నాశన మునకు పంపుటకు సాక్షి. అపవాదికిని వాని దూతలకును సిద్ధపరచిన నిత్యాగ్నిలోనికి పోవుము.

**నాధనము నిజంగా నాదేనా?**

"వెండినాది బంగారునాది. ఇదే సైన్యములకు అధిపతియైన యెహోవా వాక్కు" (హగ్గయి 2:8). "భూమియు దాని సంపూర్ణతయు లోకమును దాని నివాసులును యెహోవావే" (కీర్తన 24:1).

నిజంయేమంటే మనది యేదీలేదు.

దేవుడు మనకు అప్పగించిన వాటి యొక్క గృహనిర్వాహకులము మాత్రమే. "ఈ డబ్బునాది, నాయిష్టం వచ్చినట్లు దానిని ఖర్చు చేస్తాను" అని ప్రజలు చెప్పడం మనం ఎన్నిసార్లు వినలేదు? అట్టి వారేమి గమనించాలంటే, నాదనుకొనేది నాదికాదు గాని అది దేవునికి చెందుతాది. దేవుడిచ్చిన దానికి మనం లెక్క అప్పగించాలి.

ఒక మనుష్యుడు తన పొలాన్ని పశువులను ఒకనికి అప్పగించి దూర దేశము వెళ్లి, తిరిగివచ్చిన తరువాత ప్రతి ఫలముగా అతనికి ఒక బస్తాధాన్యం మాత్రమే యిస్తే అట్టివాడు మంచి రైతగునా?.

కొన్ని సంవత్సరముల క్రితము ఒకడు భూమిని కౌలుకు తీసికొని దాని రాబడిలో సగం యజమానికి యిస్తానని ఒప్పందం చేసుకొన్నాడు. కోతకాలమయిన తరువాత ఆ కౌలుదారుడు కనబడకపోగా యజమాని అతనిని పిలిపించాడు. అతడు వచ్చి నేను నీకు యేమీ బాకీలేను. నీ పొలం యేమీ పండలేదని జవాబిచ్చాడు. అది న్యాయమా? మనలో చాలమంది దేవునితో అట్లే ప్రవర్తించుచున్నాము.

అట్టివాడు ఒక్క గంటకే కౌలుదారుడు. మనం లెక్క అప్పగించడానికి ఎప్పుడు పిలువబడ్తామో మనకు తెలియదు. మంచి గృహ నిర్వాహకుడు తన యజమానికి లెక్క అప్పగించుటకు ఎల్లవేళలా సిద్ధపడియుంటాడు. దేవుడు మనకిచ్చిన ధనాన్ని గూర్చి లెక్క అప్పగించడానికి మనలో చాలమంది దేవునితో అట్లే ప్రవర్తించుచున్నాము.

అట్టివాడు ఒక్క గంటకే కౌలుదారుడు. మనం లెక్క అప్పగించడానికి ఎప్పుడు పిలువబడ్తామో మనకు తెలియదు. మంచి గృహ నిర్వాహకుడు తన యజమానికి లెక్క అప్పగించుటకు ఎల్లవేళలా సిద్ధపడియుంటాడు. దేవుడు మనకిచ్చిన ధనాన్ని గూర్చి లెక్క అప్పగించాలని మనలో ఎంతమంది సిద్ధముగా యున్నాము? మనం లెక్క అప్పగించాలని దేవుడు ఏ క్షణాన్నయినా మనలను పిలిచే అధికారము కలిగియున్నారు.

**ధనము వలన పాడైపోయే విధములు**

ఒకడు ధనము వలన తన జీవితములో మూడు విధములుగా పాడగును. 1. అతడు అక్రమ ధనార్జన వలన పాడగును. అవినీతితో సంపాదించిన ధనము వలన పాడగును. అట్టి అక్రమార్జన అంతా అంత్యదినమున అతనిపై సాక్ష్యము చెప్పును. "దొంగిలావాడు ఇకమీదట దొంగిలక అక్కరగలవానికి పంచి పెట్టుటకు వీలు కలుగు నిమిత్తము తన చేతులతో మంచి పని చేయుటకు

కష్టపడవలెను" (ఎఫెసీ 4:28). "ఏలయనగా ధనాపేక్ష సమస్తమైన కీడులకు మూలము" (1తిమోతి 6:10).

2. ఒకడు తన కొరకే సంపాదించుట వలన పాడగును. "ఇహమందు ధనవంతులైన వారు గర్విష్ఠులు కాక అస్థిరమైన ధనమునందు నమ్మిక యుంచక సుఖముగా అనుభవించుటకు సమస్తమును మనకు ధారాళముగా దయచేయు దేవుని యందే నమ్మిక యుంచవలెను" (1తిమో 6:17). "మీరు క్రీస్తుతో కూడ లేపబడిన వారైతే పైనున్న వాటినే వెదకుడి, అక్కడ క్రీస్తు దేవుని కుడి పార్శ్వమున కూర్చొనియున్నాడు. పైనున్న వాటిమీదనే గాని, భూసంబంధమైన వాటిమీద మనస్సు పెట్టుకొనకుడి" (కొలస్స 3:1-2). ఒకని ధనమెక్కడ ఉండునో అతని హృదయం కూడ అక్కడే ఉండునని ప్రభువు బోధించారు. మనం పరలోకములో ధనము కూర్చుకొనుటకు యిష్టపడాలి. భూమిపై మనం ధనాన్ని ప్రభువు పనిలో వినియోగిస్తే పరలోకంలో ధనము కూర్చుకొందుము.

3. ఒకడు తన ధనాన్ని వ్యసనాలకు వినియోగిస్తే పాడవుతాడు. యిది రెండు విధాలుగా యుంటాది. పాప భూయిష్ఠమైన సంగతులను ఖర్చుపెట్టుట దానిలో ఒకటి. మనకున్న ప్రతీదీ దేవుని ఘనత కొరకు వెచ్చించాలి. మన కున్న ప్రతిదాని గూర్చి తీర్పునాడు దేవునికి లెక్క అప్పగించాలి.

రెండవదిగా మనధనాన్ని వినియోగించుటకు నిరాకరిస్తే పాడవుతాము, పాపము చేస్తాము. ఈ కారణము వలననే అనేకులు పరలోకమును కోల్పోతారు. యాకోబు 5:1-6లో యిదే చెప్పబడినది. మనకు తరుణముండగా ప్రభువు పనికి ఇచ్చుటకు నిరాకరిస్తే, తీర్పునాడు అది మనకు వ్యతిరేకముగా సాక్ష్యం యిస్తాది. ఒకే తలాంతును కలిగిన వాడు దానిని వినియోగించనందున బయట చీకటిలోనికి పడద్రోయబడ్డాడు.

**లోభత్వము వలన కలుగు పాపము**

దురాశ మానవునికున్న ఒక ఘోరపాపము. దురాశవలన ఒకడు అనాధలకు ఇయ్యవలసినది ఇయ్యడు. దురాశవలన ఆపదలలో యున్న బీదవానికి అందియ్యవలసిన సహాయము అందదు.

దురాశవలన గేహాజీ ఇట్లు తలంచాడు : "సిరియనుడైన నయమాను తీసికొని వచ్చిన వాటిని అంగీకరించుటకు నా యజమానునికి మనస్సు లేకపోయెను గాని, యెహోవా జీవము తోడు నేను పరుగెత్తుకొనిపోయి అతని కలిసికొని అతని యొద్ద ఏదైనను తీసికొందునను కొనెను" (2 రాజులు 5:20). దురాశ వలన ఆకాను దొంగిలించాడు (యెహోషువ 7:21).

అందువలన అతడు నశించాడు. దురాశ ననుసరించువారిని కుష్ఠరోగముతో నేడు దేవుడు శపించితే? సహోదరులారా, ఈ దురాశను గూర్చి మనం జాగ్రత్తపడాలి. క్రొత్త నిబంధన ప్రకారము ఇచ్చుటకు నీవు మనస్కరించుచున్నావా?

**ప్రకటన గ్రంధ ప్రసంగ మాలిక: 32**

# నూతన యెరూషలేము

## (The New Jerusalem)

**పరిచయము :**

ప్రకటన 21:19-27 వరకు చదువుము. "అంతట ఆ కడపటి యేడు తెగుళ్లతో నిండిన యేడు పాత్రలను పట్టుకొని యున్న యేడుగురు దేవదూతలలో ఒకడు వచ్చి ఇటు రమ్ము, పెండ్లికుమార్తెను అనగా గొర్రెపిల్ల యొక్క భార్యను నీకు చూపెదనని" యోహానుతో చెప్పెను (21:9).

ఈ దూతను ప్రకటన 17:1లో మొదట చూడగలము.

ప్రభువు యొక్క వధువు లేక భార్యయే ఆయనసంఘము (రోమా 7:4; ఎఫెసీ 5:25-31; 2 కొరింథీ 11:5; ప్రక 19:7-9).

గొర్రెపిల్ల యొక్క భార్య పరిశుద్ధ పట్టణమని పిలువబడెను. ప్రక 21:2; 22:19.

అది నూతన యెరూషలేమని కూడ పిలువబడెను (ప్రకట 3:17; 21:2).

అది ప్రియమైన పట్టణము 20:9 దేవుడు దేనికి శిల్పియు నిర్మాణకుడై యున్నాడో పునాదులుగల ఆపట్టణము కొరకు అబ్రాహాము ఎదురు చూచెను (హెబ్రీ 11:10).

**మహిమ పరచబడిన సంఘము: (21:9-10)**

ఒక సందర్భములో యూదా కొదమ సింహమును యోహాను చూడబోగా అతనికి గొర్రెపిల్ల కనబడెను! ఇప్పుడు పెండ్లి కుమార్తెను గూర్చి, గొర్రెపిల్ల యొక్క భార్యను గూర్చి చెప్పబడగా అతడు పెండ్లి కుమార్తెను కాదుగాని ఒక పట్టణాన్ని చూచాడు !ఆపట్టణము దేవుని మహిమ గలదై పరలోకమందున్న దేవుని యొద్ద నుండి దిగి వచ్చెను.

**ఆ పట్టణ వెలుపటి భాగము : (11-12వ)**

" దానియందలి వెలుగు ధగ ధగ మెరయు సూర్యకాంతము వంటి

అమూల్య రత్నమును పోలియున్నది": ఆ పట్టణమునకు ఎత్తయిన గొప్ప ప్రాకారమును పండ్రెండు గుమ్మములును ఉండెను; ఆ గుమ్మముల యొద్ద పన్నిద్దరు దేవదూత లుండిరి, ఇశ్రాయేలీయుల పండ్రెండు గోత్రముల నామములు ఆ గుమ్మముల మీద వ్రాయబడి యున్నవి''. ఆ పట్టణమునకున్న గొప్పకాప్రాకారము భద్రతను సూచించుచున్నది. దేవుని ప్రజలకు దేవుని కాపుదల యున్నది గనుక వారు భయపడనవుసరం లేదు.

గాని నిజానికి వారికాప్రాకారము అవుసరంలేదు.

భూమ్యాకాశములు అప్పటికే గతించిపోయాయి , సముద్రము కూడ ఇక లేదు.

ఇప్పుడు రక్షింపబడిన వారందరు దేవుని సన్నిధానములో యున్నారు.

"తూర్పువైపున మూడు గుమ్మములు, ఉత్తరము వైపున మూడు గుమ్మము లున్నవి". ఆ పట్టణపు ప్రాకారము పండ్రెండు పునాదులు గలది. ఆ పునాదులపైన గొర్రె పిల్ల యొక్క పన్నిద్దరు అపొస్తలులపేర్లు కనబడుచున్నవి'' (13-14వ).

ఆ పరిశుద్ధ పట్టణపు గుమ్ములపైన ఇశ్రాయేలీయుల పేర్లు, పాత క్రొత్త నిబంధనకాలములలోని దేవుని ప్రజలను సూచించుచున్నవి.

ఇంకోమాటలో ఆ పరిశుద్ధ పట్టణం అన్ని యుగాలలోను విమోచింపబడియున్న వారిని సూచించుచున్నది. క్రొత్త నిబంధనలో ఆయన సంఘములో యున్న ప్రజలు దేవుని సన్నిధానములో యుందురు.

**పట్టణపు కొలత (15-17వ):**

ఆపట్టణమును గుమ్మములను ప్రాకారమును కొలుచుటకై యున్నవాని యొద్ద బంగారు కొలకర్ర యుండెను.

యెహెజ్కేలు 42:20నిబట్టి ఆ పట్టణము యొక్క మహిమ, ఘనత పరిశుద్ధతలను వక్కాణించుటకు కొలత వేయబడెనని గ్రహించుకోగలము.

"ఆ పట్టణము చచ్చవుకమైనది, దాని పొడవు దాని వెడల్పుతో సమానము" దాని కొలత యేడువందల యాబదికోసులైనది; దాని పొడుగును ఎత్తును వెడల్పును సమముగా ఉన్నది" దేవుని ఆలయములో అతిపరిశుద్ధ స్థలము చచ్చవుకమై యుండెను: ఇక్కడ పరిశుద్ధ పట్టణము కూడ చచ్చవుకముగా యున్నది, అంటే పరిపూర్ణమైనదని యర్థం. ఆపట్టణము 750 కోసులు, అంటే 12000 ఫర్లాంగులు అనగా 1500 మైళ్లు. దాని ప్రాకారము 144 మూరలు, అంటే 218 అడుగుల ఎత్తు,

ఈ పరిశుద్ధ పట్టణము యొక్క విస్తీర్ణత

మానవఊహకందనిది భౌతిక కొలతతో చెప్పబడుచున్నా దేవుని పరిశుద్ధ పట్టణమైన మహిమగల క్రీస్తు సంఘు యొక్క విస్తీర్ణత ఊహించలేనిది.

దేవుడు నివసించు పట్టణం, వర్ణణతీతమైన పరిశుద్ధ పట్టణం అది, ఆత్మీయ వాస్తవాలను మనకం వర్ణించుటకుగాను దానిని భౌతిక పరిమాణములతో యోహాను వర్ణించాడు.

**పరిశుద్ధ పట్టణ వైభవము (18-21వ) :**

"ఆపట్టణపు ప్రాకారము సూర్యకాంత ములతో కట్టబడెను; పట్టణము స్వచ్ఛమగు స్ఫటికముతో సమానమైన శుద్ధ సువర్ణముగా ఉన్నది". యిదంతా మన ఊహకు అందని మహిమ. ఇట్టిదేది భూమి మీద లేదు.

" ఆపట్టణ ప్రాకారపు పునాదులు అమూల్యమైన నానావిధరత్నములతో అలంకరింపబడి యుండెను".

సూర్యకాంతమురాయి, నీలము యమునారాయి , పచ్చ. వైడూర్యము , కెంపు, సువర్ణరత్నము, గోమేధికము, పుష్యరాగము, సువర్ణల శునీయము, పద్మరాగము, సుగంధము అను ప్రశస్తరత్నములతో అది అలంక రింపబడెను. యూదుల ప్రధాన యాజకుని ఏఫోదు పతకములో వీటిలోని 8 ప్రశస్త రత్నములు కనబడేవి (నిర్గమ 28: 12-20).

ఈ ఒక్కొక్క ప్రశస్త రత్నమును వివరించి ప్రత్యేక భావార్థము చెప్పనవుసరంలేదు. మానవుడు ఊహించలేనంత వైభవమును, మహిమను దేవుడు మన కొరకు సిద్ధపరచి యుంచారని దీనియంతటి భావము.

దీనిని అపొ.పౌలు ఇట్లు వర్ణించాడు : "దేవుడు తన్ను ప్రేమించు వారి కొరకు ఏవిసిద్ధ వరచెనో అవి కంటికి కనబడలేదు. చెవికి వినబడలేదు. మనుష్య హృదయమునకు గోచరము కాలేదు".

ఆయనను ప్రేమించువారికి దేవుడు సిద్ధపరచినది మహిమగలది, ఘనమైనది. దానిని మనం కంటితో చూడలేదు , దాని వైభవం వర్ణనాతీతము.

**ఆపట్టణ లోపలి భాగము (22-27 వ).**

దానిలో ఏ దేవాలయమును లేదు. సర్వాధికారియైన దేవుడగు ప్రభువును గొర్రెపిల్లయు దానికి దేవాలయమై యున్నారు. ప్రక 3:12లో చెప్పబడినది ఇక్కడ నెరువేరుట చూడగలము దేవునితోను, క్రీస్తుతోను మనం ప్రత్యక్ష సంబంధము కలిగి యుందుము.

"ఆపట్టణములో ప్రకాశించుటకై సూర్యుడైనను చంద్రుడైనను దానికక్కరలేదు; దేవుని మహిమయే దానిలో ప్రకాశించుచున్నది గొర్రెపిల్లయే దానికి దీపము".

యెషయా 60:19-20. యెహోవాయే నిత్యమైన వెలుగు .
దేవుడు వెలుగై యున్నాడు; ఆయన యందు ఎంత మాత్రము చీకటిలేదు (1 యోహాను 1:5; యోహాను 8:12; ప్రక 22:16).
రక్షింపబడిన జనములు దాని వెలుగునందు సంచరింతురు; భూరాజులు తమ మహిమను దానిలోనికి తీసికొనివత్తురు" ప్రకటన 5:8-9 చదువుము.
"అక్కడ రాత్రి లేనందున దాని గుమ్మములు పగటి వేళ ఏమాత్రమును వేయబడవు".
రాత్రి లేక చీకటి పాపమును సూచించెను. అధిభయంమును కల్పించెను. నిషిద్ధమైనదేదియు, అసహ్యమైన దానిని, అబద్ధమైన దానిని జరిగించువాడైనను దానిలో ప్రవేశింపనే ప్రవేశింపరు గనుక దానిని గుమ్మములు ఏమాత్రమును వేయబడవు.
గొర్రెపిల్ల యొక్క జీవగ్రంధమందు వ్రాయబడిన వారే దానిలో ప్రవేశింతురు జీవగ్రంధము దేవుని ఘనత గ్రంధము (Honour Roll) అని చెప్పవచ్చును. పరలోకములో ఎవరెవరు ఉందురో వారి పేర్లు దానిలో యుండును (ప్రకట 20:15).

**ముగింపు :**

బైబిలు అంతటిలోను గొప్ప సమైక్యతయున్నది. ఆదికాండములోని మొదటి మూడు అధ్యాయములు, ప్రకటనలోని ఆఖరిమూడు అధ్యాయములు మహిమగల ఆరంభము, మహిమాన్వితమైన ముగింపును గూర్చి చెప్పుచున్నవి.
దేవుడు భూవ్యాకాశములను సృజించెనని ఆదికాండము చెప్పుచున్నది. దేవుడు క్రొత్తభూమిని ఆకాశమును సృజించునని ప్రకటన చెప్పుచున్నది. దేవుడు సూర్య చంద్ర నక్షత్రములను సృజించెనని ఆదికాండము చెప్పుచున్నది. గాని ప్రకటన 21:3 "ఆపట్టణములో ప్రకాశించుటకై సూర్యుడైనను చంద్రుడైనను దానికక్కరలేదు; దేవుని మహిమ యే దానిలో ప్రకాశించుచున్నది. గొర్రెపిల్లయే దానికి దీపము" అని చెప్పుచున్నది.

సాతాను యొక్క కుయుక్తిని, మోసమును ఆదికాండము చెప్పుచున్నది. గాని సాతాను అగ్ని గంధకములతో మండు గుండములో పడవేయబడునని వాని అంతమును గూర్చి ప్రకటన చెప్పుచున్నది.

దేవుని సముఖమునుండి పాపము వలన మానవుడు పారిపోవుచున్నట్లు ఆదికాండము చెప్పుచున్నది. ప్రకటనలో అయితే "ఇదిగో దేవుని నివాసము మనుష్యులతో కూడ వున్నది. ఆయన వారితో కాపురముండును" అని తెలియజేయబడింది (ప్రక 21:3-4).

క్రైస్తవుని యొక్క నిత్య గమ్యము

వరలోకము . నీవు వరలోకము వెళ్లగోరుచున్నావా ? అట్లయితే క్రీస్తు సువార్తను నమ్మి, బాప్తిస్మము పొంది మరణ పర్యంతము నమ్మకముగా జీవించుము!(మార్కు16:16;ప్రక 2:10).

**బైబిలు సర్వే :**

# సంఘ స్థాపన

ప్రభువు పరలోకమునకు వెళ్ళిపోయిన 10 దినముల తరువాత యెరూషలేములో సంఘము స్థాపించబడునట్లు చేసెను. సంఘము ఎట్లా స్థాపించబడినది క్రొత్తనిబంధనయందలి ఒకే ఒక్క చరిత్రగ్రంథమైన "అపొస్తలుల కార్యముల" యందు విపులంగా వ్రాయబడినది. ఈ గ్రంథము వైద్యుడైన లూకాచే వ్రాయబడినది. ఇందు కొంతమంది అపొస్తలుల చేసిన సువార్త వాక్యమును గూర్చియు వారు ఎట్టివిధముగా ఎక్కడెక్కడ సంఘములను స్థాపించిరో వాటిని గూర్చియు క్రమముగా వ్రాసెను. ముఖ్యముగా పేతురు, పౌలు చేసిన కార్యములను గూర్చి నొక్కి చెప్పెను. ఈ పాఠమునందు యెరూషలేమునందు సంఘము ఎట్లు స్థాపించబడింది ఆ తరువాత జరిగిన సంగతులను మొదటి 7 అధ్యాయములలో పరిశీలిద్దాం.

వాక్యములో క్రీస్తు శరీరమును వివిధములైన పేర్లతో పిలిచారు. అవేవనగా –"సంఘము", "దేవుని రాజ్యము", "పరలోక రాజ్యము". సంఘము రాజ్యము అను రెండు వేరు వేరు పదములు శరీరమును గూర్చే. యేసు పేతురుతో మత్తయి 16:18,19లో యిలా చెప్పారు; "మరియు నీవు పేతురుతో, ఈ బండమీద నా సంఘమును కట్టుదును. పాతాళలోక ద్వారములు దాని ఎదుట నిలువ నేరవని నేను నీతో చెప్పుచున్నాను. పరలోక రాజ్యముయొక్క తాళపుచెవులను నీ కిచ్చెదను, నీవు భూలోక మందు దేనిని బంధించుదువో అది పరలోక మందును బంధించబడును. భూలోకమందు దేనిని విప్పుదువో అది పరలోక మందును విప్పబడును". రాజ్యము, సంఘము అను ఈ రెండుపదములను యేసు ఒకదానికొకటి వర్తించునట్లు వాడెను. కనుక మనంకూడా సంఘస్థాపన గూర్చి పరిశీలించునప్పుడు వీటిని వుపయోగించుదాం.

**సంఘము ఎందుకోసం ఉద్దేశించబడింది?**

సంఘమును భూమిమీద స్థాపింపక పూర్వము దేవుడు దానిని తన

మనసునందు నిర్ణయించుకొనెను. దీనినే పౌలు ఎఫెసీ 3:10-11లో ఈలాగు వ్రాసాడు "దేవుడు మన ప్రభువైన యేసు క్రీస్తునందు చేసిన నిత్యసంకల్పము చొప్పున పరలోకములో ప్రధానులకును అధికారులకును సంఘముద్వారా తన నానావిధమైన జ్ఞానము ఇప్పుడు తెలియబడవలెనని ఉద్దేశించి శోధింప శక్యముకాని క్రీస్తు ఐశ్వర్యమును అన్యజనులలో ప్రకటించుటకును సమస్తము సృష్టించిన దేవునియందు పూర్వకాలమునుండి మరుగైయున్న ఆ మర్మము గూర్చి ఏర్పాటు ఏట్టిదో అందరికినీ తెలియపరచుటకు.......".

**ప్రవచించబడిన సంఘము:**

సర్వాధికారియైన దేవుడు సంఘమును గూర్చిన తన (ఆలోచనము) అభిప్రాయమును ప్రవక్తల ద్వారా ముందుగా ప్రవచించెను. రాజైన నెబుకద్నెజరునకు వచ్చిన కల దాని భావమును దానియేలు వివరిస్తూ యీ విధంగా చెప్పాడు, " ఆ రాజుల కాలములో పరలోకమందున్న దేవుడు ఒక రాజ్యమును స్థాపించును, దాని కెన్నటికినీ నాశనము కలుగదు, ఆ రాజ్యము దానిని పొందినవారికిగాక మరెవరికిని చెందదు; అది ముందు చెప్పిన రాజ్యము లన్నిటిని పగులగొట్టి నిర్మూలము చేయునుగాని అది యుగయుగములవరకు నిలుచును" (దాని 2:44). ఇచ్చట రాజ్యము స్థాపించబడునని మాత్రమే వుంది. కానీ దాని ఆత్మీయ స్థితి యింకనూ బయలుపరచలేదు.

బాప్తిస్మమిచ్చు యోహాను సంఘము స్థాపించబడుటను గూర్చి స్థిరపరచు కార్యక్రమమును మొదటప్రారంభించెను. ఇదిక్రీస్తు తన పరిచర్య ప్రారంభించుటకు 6 నెలల ముందు యోహాను మొదలు పెట్టాడు.

అతి సమీపముగా నున్న దేవుని రాజ్యమును గూర్చి యోహాను యిలా ప్రవచించాడు: "పరలోక రాజ్యము సమీపించి యున్నది మారుమనస్సు పొందుడి" (మత్తయి 3:2). వెనువెంటనే యేసు పరలోక రాజ్యము సమీపించియున్నది గనుక మారుమనస్సు పొందుడని చెప్పుచూ ప్రకటింప మొదలు పెట్టెను" (మత్తయి 4:17). ఆయన తన శిష్యులను కూడా ఈ విధముగా హెచ్చరించి పంపించాడు. మీరు వెళ్ళి "పరలోక రాజ్యము సమీపించి యున్నదని ప్రకటించుడి" (మత్తయి 10:7), ఆతరువాత ఆయన ఈవిధముగా వాగ్దానము చేశాడు. "ఈ బండమీద నా సంఘమును నేను కట్టుదును" (మత్తయి 16:18).

యేసు ఆయన శిష్యులతో తన

సంఘాన్ని ఎప్పుడు, ఎక్కడ ఎలాగు స్థాపిస్తాడో చెప్పాడు. మరియు ఆయన -ఇక్కడ నిలచియున్న వారిలో కొందరు దేవుని రాజ్యము బలముతోవచ్చుట చూచు వరకు మరణము రుచిచూడరని నిశ్చయముగా మీతో చెప్పుచున్నానని నెను''(మార్కు 9:1). ''ఐననూ పరిశుద్ధాత్మ మీమీదికి వచ్చునప్పుడు మీరు శక్తి నొందుదురు. గనుక మీరు యెరూషలేములోను యూదయ సమరయ దేశములయందంతటను భూదిగంతములవరకు నాకుసాక్షులై యుందురని వారితో చెప్పెను (అకా. 1:8). "ఇదిగో నాతండ్రి వాగ్దానము చేసినది మీమీదికి పంపుచున్నాను, మీరు పైనుండి శక్తి పొందువరకూ పట్టణములో నిలిచి యుండుడని వారితో చెప్పెను" (లూకా 24:49). ఈ పైచెప్పబడిన వచనా లన్నిటినీ క్రోడీకరించినట్లైతే మనం తెలుసుకోగల సంగతు లేవన - 1) అపొస్తలులు జీవించియున్నపుడే సంఘము స్థాపించబడును, 2) అది శక్తితో వచ్చును, 3) అది యెరూషలేము నందు స్థాపించబడును.

**సంపూర్తియైన సంఘము :**

అపొస్తలులు ప్రభువు వారిని ఆజ్ఞాపించిన ప్రకారము వారు యెరూషలేములో కనిపెట్టుచూ వుండుట అపొస్తలుల కార్యముల గ్రంథ మందు ఒకటవ అధ్యాయమున చూడగలము.

వారు ఆలాగు కనిపెడుతూ వురిపోసుకొని చనిపోయిన ఇస్కరియోతు యూదా స్థానములో మత్తీయను ఏర్పాటు చేసుకొన్నారు. యేసు పరమునకు వెళ్ళిన 10 రోజుల తరువాత అనగా ఆయనను శిలువ వేసిన పస్కాపండుగ తరువాత 50వ రోజున "పెంతెకోస్తు" అనే పండుగ వచ్చింది ఆపండుగకు వేలసంఖ్యలో యూదులు యెరూషలేము వచ్చారు. అప్పుడు ఉదయం 9.00 గం॥లకు, "అప్పుడు వేగముగా వీచు బలమైన గాలివంటి యొక ధ్వని ఆకాశమునుండి అకస్మాత్తుగా, వారు కూర్చుండి యున్న యిల్లంతయూ నిండెను. మరియూ అగ్ని జ్వాలలవంటి నాలుకలు విభాగింపబడినట్టుగా వారికి కనబడి, వారిలో ఒక్కొక్కరిమీద వ్రాలగా అందరు పరిశుద్ధాత్మతో నిండినవారై ఆ ఆత్మ వారికి వాక్‌శక్తి అనుగ్రహించినకొలది అన్యభాషలతో మాటలాడసాగిరి'' (అపొ.కా. 2:2-4).

యేసు వాగ్దానము చేసిన శక్తి ఆయన రాజ్యమును స్థాపించునప్పుడు వచ్చినది. ఇప్పుడు సంఘము దేవుని ఉద్దేశమందుండుట, దానిని ప్రవక్తలు ప్రవచించుట ప్రవచించిన సంఘము స్థాపనకుముందు సిద్ధపాటు, ఆలాగు

సిద్ధపరచినదాని స్థాపన పూర్తియగుట మనం యిప్పుడు చూడగలము. అపోస్తలులు గుంపులు గుంపులుగా కూడిన ప్రజలకు క్రీస్తును ప్రకటించు మంచి అవకాశాన్ని పొందారు, ఈ సమయమునందే ఒక అసాధారణమైన కార్యం జరిగింది. అదేమిటంటే ప్రతీవాడు తన తన భాషలో దేవుని సువార్త విన్నారు. వారందరు కొందరు ఏమన్నారంటే అపోస్తలులు మద్యముతో మత్తుల య్యారన్నారు. అప్పుడు పేతురు వారి మధ్య నిలబడి మాట్లాడటం మొదలు పెట్టాడు. అయ్యా మీరు వూహిస్తున్నట్లు వీరు మద్యముతో మత్తులు కాలేదు. కానీ ఈ అద్భుతమైనశక్తి దేవునియొద్దనుండి వచ్చింది. దీనినే యోవేలు ముందుగా ప్రవచించాడు. అలా చెప్పుచూ మీరు శిలువ వేసిన యేసు దేవుని కుమారుడు. దేవుడు ఆయనను మృతులలోనుండి లేపాడని చెప్పాడు. అతడు చెప్పిన ప్రసంగం చాలా శక్తి వంతమైనది కనుక వారు హృదయమందు నొచ్చుకొని, "సహోదరులారా మేమేమి చేతుమని" అడిగారు (అ.కా. 2:37). దేవుని కుమారుని చంపామని వారు పశ్చాత్తాపపడి క్షమాపణ పొందాలని ఆశించారు. పేతురు ఈవిధంగా సమాధన మిచ్చాడు: "మిరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసు క్రీస్తు నామమున బాప్తీస్మము పొందుడి, అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు. ఈ వాగ్దానము మీకును మీ పిల్లలకును దూరస్థులందరికినీ, అనగా ప్రభువైన మన దేవుడు తన యొద్దకు పిలిచినవారి కందరికిని చెందునని వారితో చెప్పెను" (అకా. 2:38,39). ఈ విధముగా చెప్పి వారు మారుమనస్సు పొంది బాప్తీస్మం పొందితేనే కాని వారి (మన) పాపములు క్షమించబడవు. ఆ దినమందు 3000 మంది పాప క్షమాపణ నిమిత్తము బాప్తీస్మము పొందిరి. సంఘము స్థాపించబడింది.

అసమయమునందే మొదట రక్షించబడిన వీరిని ప్రభువు సంఘముతో చేర్చుచుండెను" (అ.కా. 2:47). వారు వారి పాపములనుండి రక్షించబడి ఆ క్షణమందే సంఘములో భాగమైనారు. మత శాఖల భావము లేకుండా చూచినట్లైతే సంఘమనగా రక్షింపబడిన వారి సమూహాము. సంఘములో లేకుండా ఒకడు తన పూర్వపాపముల నుండి రక్షింపబడలేడు. ఒకడు రక్షించబడకుండా సంఘములో వుండ లేడు. ఇంకా వాక్యాన్నిబట్టి మనం నేర్చుకుంటున్న దేమంటే అది క్రైస్తవులు తమంతతాము సంఘములో చేరలేదు కానీ ప్రభువే సంఘముతో చేర్చు

చుండెను. ప్రస్తుతం ఈలాటి అభిప్రాయాన్ని మనం వినుటలేదు. అనగా రక్షించబడినవారే సంఘములో తమంత తాము చేరుచున్నామని అనుచున్నారు. ఇది వాక్య విరుద్ధం. మొదట క్రైస్తవులు అతి సామాన్యమైన పద్ధతిలో కలసి జీవించారు. "వీరు అపోస్తలుల బోధయందును సహవాసము నందును, రొట్టె విరచుట యందును ప్రార్థన చేయుట యందును ఎడతెగక యుండిరి" (అ.కా. 2:42). రొట్టె విరచుట యనగా ప్రభు రాత్రి భోజనముగా భావించ వలయును, అప్పుడు సంఘము చాలా త్వరితగతిని అభివృద్ధి చెందినది. ఒకనాడు పేతురు యోహానులుఒక కుంటివానిని స్వస్థపరచినందు వలన యూదులలోని నాయకులకు కోపము వచ్చినది. వారు పేతురు యోహానులను బంధించి బెదిరించి విడిచి పెట్టారు. మరలా వారు బోధించుట యూదుల నాయకులు చూచినప్పుడు పేతురు యోహానులను మాత్రమే కాక మిగిలిన అపోస్తలులను కూడా బంధించి చెరసాలలో పెట్టారు. కానీ దేవుని అద్భుత కార్యము ద్వారా వారు చెరసాల నుండి బైటకువచ్చి క్రీసును ప్రకటించుట మొదలు పెట్టారు. మరలా వారు బంధించబడ్డారు, కొట్టబడ్డారు. చివరిగా యూదులు వారిని బెదిరించి విడిచి పెట్టారు.

సంఘములో కొన్ని సమస్యలు తల ఎత్తాయి. వారిలో చాలా మంది నిరుపేదలు .అందువల్ల కొందరు తమకు కలిగిన ఆస్తులను అమ్మి అక్కర గానున్నవారికి పంచిపెట్టారు. అననీయ, సప్పీరాలను భార్యాభర్తలున్నారు. వారు పొలాన్ని అమ్మి దానిలోని కొంతమాత్రమే అపొస్తలులకు యిచ్చారు. అపొస్తలులు అడిగినప్పుడు ఇంతకే అమ్మామని అబద్ధమాడారు. వారు అబద్ధమాడిన ందుకు వారిని దేవుడు మొత్తాడు. వారు చనిపోయారు. అప్పుడు సంఘమంతయు భయపడింది. గ్రీకుదేశము నుండి వచ్చిన విధవరాండ్రను సరిగాచూచుటలేదని వచ్చిన అభియోగమునుబట్టి అనుదిన పరిచర్యకోసం కొంతమంది పరిచారకులను అపొస్తలులు ఏర్పాటుచేశారు. వారిలో ఒకడైన స్తెఫను యూదులతో వివాదం వచ్చినప్పుడు వారతని సభయొద్దకు తీసుకువెళ్ళారు. అప్పుడు స్తెఫను వారిఎదుట ప్రసంగించాడు. వారు బహూగా కోపించి ఇతనిని రాళ్ళతో కొట్టి చంపారు. ఇతడు హతసాక్షియైన మొదటక్రైస్తవుడు, వారు స్తెఫనును చంపి అతని వస్త్రాలను సౌలు అనే యౌవనస్తుని పాదములయొద్ద వుంచారు. తరువాత ఈ సౌలు క్రైస్తవుడుగా మారి మనకు తెలిసిన పౌలు నామధేయుడయ్యాడు.

## యేసు సమాధిచేయబడెను, దానిపై పెద్దరాయి పొర్లింపబడెను, రోమా ముద్రవేయబడెను. రోమా సైనికులు కావలా యుండిరి

యేసు చనిపోయిన తరువాత అరిమతయి యోసేపు తాను రాతిలో తొలిపించుకొనిన తన సమాధిలో యేసు శరీరాన్ని వుంచెను. అతడు యేసు యొక్క రహస్యశిష్యుడు, గాని రక్షకుడు తన కొరకు చనిపోయినప్పుడు అతడు తన భయాన్నంతా కోల్పోయెను. పిలాతునొద్దకు వెళ్లి యేసు శరీరమును సమాధిచేయుటకు తన కియ్యుమని అడిగెను. అతడును నీకోదేమును ఆయనను ఆ క్రొత్త సమాధిలో పాతిపెట్టిరి. గొప్పరాయి ఆ సమాధి మీద పొర్లింపబడెను. ఆయనను ప్రేమించిన స్త్రీలు చూచుచుండిరి (మత్త 26:54-61; మార్కు 9:31; 10:34; లూకా 23:49-56; యోహాను 19:38-42).

యేసును సిలువ వేయించిన యూదా నాయకులు తాను చనిపోయినను మూడవనాడు తిరిగి లేతునని యేసు చెప్పిన మాటలను జ్ఞాపకము చేసికొనిరి (మత్త 12:40; 16:21; యోహాను 2:19-22; మార్కు 9:31; 10:34; లూకా 9:22; 18:33). అందువలన మూడవదినము వరకు ఆయన సమాధిని భద్రము చేయుమని పిలాతు ఆజ్ఞాపించెను (మత్తయి 27:62-66 ). "కావలివారు న్నారుకదా, మీరు వెళ్లి మీ చేతనైనంతమట్టుకు సమాధిని భద్రము చేయుడని వారితో పిలాతుచెప్పెను. వారు సమాధిపై ముద్ర వేసి, సైనికులను అక్కడ కావలాయుంచిరి.

కావలి వారు ఆదివారం వరకు తమ విధిలో యుండిరి. ఒక దూతవచ్చి రాయిని పొర్లించి దానిమీద కూర్చుండెను. కావలి వారు చచ్చిన వారివలేవడి యుండిరి. యేసు సమాధినుండి సజీవుడై తిరిగి లేచెను; ఆయన మరెన్నటికిని చనిపోడు !! సాతానుడు గాని, వాని అనుచరులుగాని ఆయన పునరుత్థానమును ఆపలేక పోయిరి.

**యేసు యొక్క పునరుత్థానమును సాతానుడు అడ్డుకోలేక పోయెను:**

సాతానుడు యూదుల నాయకులను ప్రేరేపించి, వేము నిద్రించుచుండగా ఆయన శిష్యులాయనను ఎత్తి కొనిపోయిరని పలికించెను (మత్త 27:11-15). నిద్రించువాని యొక్క సాక్ష్యము నిష్ప్రయోజనం ! యేసు తిరిగి లేచిన తరువాత ఆయన అనేకులకు కనబడెను. తాను లేచినట్లు నిరూపిం చుకొనెను (అపొ.కా. 1:3).

స్త్రీలు ఆ సమాధి కాళిగా యుండుట కనుగొనిరి, తెల్లని వస్త్రములు ధరించిన దూతలు,"సజీవుడైన వానిని మీరెందుకు మృతులలో వెదకుచున్నారు? ఆయన ఇక్కడ లేడు, ఆయన లేచియున్నాడని" వారికి చెప్పిరి (లూకా 24:1-7). ఆసాయంకాలమున యేసు అపొస్తలులకు కనబడెను. గాని వారాయనను నమ్ముటకు శంకించిరి. ఆయన సజీవ రక్తము నేలకు కారుట వారుచూచిరి. గనుక వారాయన ఆత్మను చూచుచున్నామను కొనిరి.అయితే యేసు నా కున్నట్టుగా మీరు చూచుచున్న యెముకలును మాంసమును భూతమున కుండ వనిచెప్పెను ". వారు కాల్చిన చేపముక్కను ఆయన కిచ్చిరి. ఆయన దానిని తీసికొని భుజించెను (లూకా24).

యేసు శిష్యులకగుపడినప్పుడు తోమా వారితోలేడు . ఆయున గాయములలో వ్రేలుపెట్టి చూస్తేనే గాని ఆయన లేచినట్లు నేను నమ్మనని అతడు చెప్పాడు. ఆ మరుచటివారం వారంతా ఒక చోటయున్న ప్పుడు యేసు వారియొద్దకు వచ్చెను, ఆయన తోమా యొక్క తలంపుల నెరిగి తోమాను చూచి, "నీ వ్రేలు ఇటుచాచి నా చేతులు చూడుము ; నీ చెయ్యి చాచి నా ప్రక్కలో ఉంచి అవిశ్వాసివికాక విశ్వాసివై యుండు మనెను. అందుకు తోమా - నాదేవా నా ప్రభువా అనెను" (యోహా 20:24-29).

**అపొస్తులులు చూచుచుండగ యేసు ఆరోహణం :**

యేసు పునరుత్థానుడైన 40 దినముల మట్టుకు ఆయన అనేకులకు కనబడెను, మాట్లాడుచుండెను. ఒకే సమయమందు ఆయన 500 మందికి కనబడెను (1కొరింథీ 15:6). "ఆయన అనేకమైన రుజువులు చూపితన్నుతాను సజీవునిగా కనుపరచు కొనెను" (అపో.కా. 1:3). యేసు చనిపోవగా చూచిన ప్రత్యక్ష సాక్షులు నిరాశ జెందినవారై తిరిగి వెళ్లిరి, సజీవుడైన రక్షకునితో నడచిన తరువాత వారు ధైర్యము తోను, నిరీక్షణ తోను నింపబడిరి.

క్రీస్తు తన తండ్రి యొద్దకు ఆరోహణమవుతానని తన శిష్యులకు ముందుగానే తెలియపరచెను, తాను వెళ్లి తమకొరకు స్థలము సిద్ధపరచుదునని ఆయన చెప్పెను. గాని ఒక దినమందు ఆయన మరల వచ్చునను (యోహా14:1-3), అయితే ఆయన ఒలీవ కొండపై నుండి తండ్రి యొద్దకు ఆరోహణమవగా వారందరు ఆశ్చర్య చకితులై నిలుచుండిరి. వారుచూచు చుండగా ఆయన ఆకాశ మేఘరూఢుడై వెడలిపోయెను. (అపో.కా 1:9-12). అదే రీతిగా ఆయన మరల తిరిగి వచ్చునని దూతలు వారికి జ్ఞాపకం చేసిరి (ప్రక1:7).

యేసు ఆరోహణుడు కాకముందు ఆయన గొప్ప ఆజ్ఞను జారీచేసెను. ఆయన తిరిగి వచ్చువరకు ఆయాజ్ఞ అమలులో యుండును, యేసు యొక్క మరణ సమాధి పునరుత్థానములకు సాక్షులైన అపొస్తలులు ఆవాస్తవములను ధైర్యముగా బోధించిరి, యేసు నిమిత్తము వారు కొట్టబడిరి, హింసింపబడిరి, కొందరు చంపబడిరి, ఆయన పునరుత్థానము వాస్తవమని వారెరుగుదురు. అందువలన వారి ప్రాణాలతో ఆ సాక్ష్యమునకు ముద్రవేసిరి.

**క్రీస్తు యొక్క గొప్ప ఆజ్ఞ :**

క్రీస్తు యేమి చేసెనో మనుష్యులందరికీ చెప్పుమనెను. రక్షింప బడుటకు వారేమి చేయవలెనో చెప్పవలెననెను.

**మత్తయి 28:18-20** ; "అయితే యేసు వారి యొద్దకు వచ్చి - పరలోకమందును భూమి మీదను నాకు సర్వాధికారమీయబడియున్నది. కాబట్టి మీరు వెళ్లి సమస్తజనులను శిష్యులనుగా చేయుడి; తండ్రి యొక్కయు కుమారుని యొక్కయు పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటినన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి; ఇదిగో యుగ సమాప్తివరకు సదా కాలము మీతో కూడ ఉన్నానని వారితో చెప్పెను.

**మార్కు 16:15-16;** " మరియు మీరు సర్వలోకమునకు వెళ్లి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి. నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింప బడును ; నమ్మనివానికి శిక్ష విధించబడును" అని చెప్పెను.

**లూకా 24:46-47;**"క్రీస్తు శ్రమపడి మూడవదినమున లేచుననియు యెరూషలేము మొదలు కొని సమస్త జనములలో ఆయన పేరట మారుమనస్సును పాపక్షమాపణయు ప్రకటింపబడుననియు వ్రాయబడి యున్నది, ఈ సంగతికి మీరే సాక్షులు" అని చెప్పెను.

**క్రీస్తు ఆజ్ఞను గమనించుము:**

ఎవరికి ? - తన శిష్యులకు, వెళ్లమని ఆజ్ఞాపించెను. తన అనుచరులు మూడు సంగతులు చేయలన్నారు.

మరల రక్షింపబడుటకు ప్రజలు మూడు సంగతులు చేయాలన్నారు.

(సమాప్తం)

- చార్ల్స్ స్కాట్

# దేవుని యొక్క పునాది

## (The Foundation of God)

భవన నిర్మాణములో పునాది ప్రాముఖ్యము. విద్యాసంస్థలకు మంచి పునాదులు ప్రాముఖ్యము. మానవుని జీవితంలో మంచి పునాదులు ప్రాముఖ్యము.

అతి త్వరితముగా మార్పు చెందుతున్న యుగంలో దేవుని యొక్క స్థిరమైన పునాది నిలుకడగా యున్నదియని తెలసికొనుట చాల ప్రోత్సాహమునిచ్చుచున్నది (2 తిమో 2:19).

మొదటి శతాబ్దములోని క్రైస్తవ సోదరులు నేడు మనవలెనే కొన్ని సార్లు అసత్య బోధలవలన కలత జెందేవారు. సత్యము విషయము తప్పిపోయిన బోధకులుండేవారు (2 తిమో 2:18). సత్యమునుండి తొలగిపోయినా, దానిని చెరిపినా ఆ సంగతిని తెలిసికోలేనంత గజిబిజిగా సత్యము ఎన్నడు లేదు. అయినను సత్యమునుండి తొలగిపోయిన వారు దేవుని పునాదిని కదలింప లేకపోయారు.

ప్రభువు తన వారినెరుగును (2 తిమో 2:19). ప్రభువు నెరిగిన ప్రజలున్నారు. ప్రభువు ఎరిగిన ప్రజలున్నారు. వారు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన వారు గనుక దేవుని కుమారులు (గలతీ 3:26-27). క్రీస్తులో నిలిచియున్న నమ్మకమైన ప్రజలున్నారు (యోహాను 15:4). ఎన్ని శ్రమలు, బాధలు, హింసలు కలిగినా ప్రభువుకు నమ్మకముగా యున్న ప్రజలున్నారు. ప్రభువుకు నమ్మకముగా యున్న ప్రజలున్నారు. ప్రభువు తన వారి నెరుగుననుటలో గొప్ప నిర్ధారణ అనుగ్రహించబడుచున్నది. దేవుడు తన వారి నెరుగుననుటలో గొప్ప ఆదరణ యున్నది. ప్రభువు తన వారిని గూర్చి చింతించును, రక్షించును, కాపాడును, దీవించునను దానిలో గొప్ప నిరీక్ష యున్నది.

"నేను మిమ్మును ఎన్నడు ఎరుగను" అని ప్రభువు కొందరితో తీర్పునాడు చెప్పును. అదెంతటి విచా÷రమో! (మత్త 7:23), అయితే మనలను నిత్యము తనవారిగ ప్రభువు గుర్తించితే ఎంత ఆనంద దాయకమో కదా!

– టామ్ హాలెండ్

# వెళ్లుదము రండి
## (Let us Go)

కీర్తన కారుని యొక్క ఈ మాటలు చదివినప్పుడెల్లా నాకు చాల ఆనందము కలుగుతాది. ఇశ్రాయేలీయునికి యెరూషలేము యాత్రకు, దేవుని మందిరము దగ్గరకు వెళ్లడం అంటే మహదానంద సందర్భమే. ఇశ్రాయేలులో దూరప్రాంతములలో యున్నవారు యెరూషలేముకు వెళ్లి "ఇశ్రాయేలీయులకు నియమింపబడిన శాసనమును బట్టి యెహోవా నామమునకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుట " అరుదుగా లభించే తరుణము (కీర్తన 122:4). దేవుని ప్రత్యేకస్థలములో ఆయన నారాధించుట ఒక గొప్ప విశిష్టమైన అనుభవం, ధన్యత.

దేవుడొక ఆలయములో నివసింపదుగదాయని నీవు చెప్పనక్కర్లేదు. ఆయన ఎన్నడు ఒక ప్రత్యేక స్థలమునకు పరిమితుడు కాలేదనునది గొప్ప వాస్తవము. అయితే దేవుని నామమునకు స్తుతులు చెల్లించే సమయము, స్థలమును గూర్చి మనం కావలసినంత వక్కాణించలేదేమో. అనేకులకు, ప్రభువుదినము ప్రభువు సంఘము అంటే సంతోషం కలుగకపోవచ్చు. అట్టివారు ఆరాధనకు ఆలయమునకు వచ్చేసరికి దానిని చూడవచ్చును. వారు దాని ముందు రాత్రి ఆట పాటలలో గడిపిన విధానాన్ని బట్టి ఆదివారం ఆరాధనకు వచ్చు సరికి ఏమంత సంతోషంగా కనబడరు. ఆరాధనకు వెళ్లుదము రండని ఎవరైన చెబితే వారు సంతోషించరు.

మనం ఆ సంతోషాన్ని పునరుద్ధరించాలి, మన దేవుని ఆరాధించడం మనకు లభ్యమైన గొప్ప తరుణం అని గమనించాలి. దేవుని ప్రజలతో కూడు కొనుట ఒక ప్రత్యేకమైన తరుణమని మన పిల్లలకు నేర్పించాలి. మనం తరుచు కూడు కొనుట వలన ఆయానందం యేమీ తగ్గిపోదు. దేవుడు మనకు చేసినదంతా మరచి పోవడం మన యొక్క నైజమే. అందు వలన ఆయన నారాధించుటకు వచ్చినప్పుడు ఆనందించ లేక పోవుచున్నాము.

గనుక మనం యేమి చేయాలి? దేవుడు తన కుమారుడైన యేసు

క్రీస్తు ద్వారా మనలను రక్షించారని అనుదినం జ్ఞాపకముంచు కోవాలి. దేవుని వాక్యాన్ని తరుచు చదువుచు ఆయన వాక్యం వివరించబడుచుండగా వినడానికి ఆసక్తి కల్పించుకోవాలి. ముందుగానే సంకల్పించుకొని, యేర్పాటు చేసుకొన్న ప్రణాళిక చొప్పున ఆరాధనకొరకు ఎదురు చూచునట్లు మనపిల్లలను తయారు చేయాలి.

ఆదివార ఆరాధనను గూర్చి శనివారమే మాట్లాడుకోవాలి, సంకల్పించాలి. ఆసక్తితో నిద్రలేవాలి. శుద్ధ మనస్సుతో యెహోవా మందిరమునకు వెళ్లి సంతోషముతో ఆయనను ఆరాధించాలి. "యెహోవా మందిరమునకు వెళ్లుదము రండి అని జనులు నాతో అనినప్పుడు నేను ఆనందించితిని !" (కీర్తన 122:1).

- బాబీ వీట్

RNI Regd. No. 6997/98
Postal Regd. No. AP/KD-02/2009-2011

To

From:
**SATYA VAKKU**
**P.O. Box 80, Kakinada - 533 001**

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambhamurthy St. Kakinada - 533 004